www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 4 మార్చి 2024



మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉమ్మడి కడప జిల్లా ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జియోన్ కళాశాలలో ఈనెల 4,5 తేదీల్లో సాయంత్రం 4 గంటలకు మహిళాలకు ఆటలు పోటీలు ప్రిన్సిపల్ మేడం రోడ మెర్సీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఎన్‌జిఒ అధ్యక్షులు బి.శ్రీనివాసులు,రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.ప్రసాద్ యాదవ్, జిల్లా కార్యదర్శి డి.రవికుమార్, రాష్ట్ర ఉమెన్ వింగ్ ఉపాధ్యక్షురాలు నిర్మల జ్యోతి, జిల్లా ఉమెన్ వింగ్ అధ్యక్షులు శాంతమ్మ, కన్వీనర్ భారతి తెలిపారు. ఉమ్మడి జిల్లా లోని అన్ని శాఖల్లో పనిచేసే మహిళా ఉద్యోగులు, వార్డు, సచివాలయం మహిళా ఉద్యోగులు పాల్గొన్ని ఆటల పోటీలు విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

నిరంతర విద్యుత్ సరఫరానే ధ్యేయం

- గ్రామీణ ప్రాంతాలకు త్రీ ఫేస్ విద్యుత్ సరఫరా
- 48 గంటల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు
- సబ్సిడీతో కూడిన సూర్య ఘర్ స్కీమ్
- ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎస్.రమణ

ప్రజాశక్తి - కడప ప్రతినిధి



ముఖా ముఖి..

నిరంతర విద్యుత్‌ను సరఫరా చేయడమే ధ్యేయంగా ముందుకెళ్తున్నాం. జెఎల్ఎంల నుంచి గ్రేడ్-2 అధికారుల వరకు వారానికి రెండు దఫాలుగా సమీక్ష చేయడంతో అంతరాయానికి ముకుతాడు వేయగలుగుతున్నాం. గ్రామీణ ప్రాంతాలకు త్రీపేస్ విద్యుత్‌ను సరఫరా చేయడం ద్వారా పారిశ్రామికాభివృద్ధికి ఊతమిచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. సబ్సిడీతో కూడిన సూర్యఘర్ స్కీమ్ ద్వారా అర్బన్ ప్రాంతాల్లోని ఇళ్లకు విద్యుత్‌సదుపాయం అందుబాటులో తీసుకొచ్చే ప్రయత్నం ఊపందుకుంది. దీంతో పాటు సంస్థకు ఆదాయాన్ని సమకూర్చడంలో భాగంగా డిజిటల్ పేమెంట్స్‌ను ప్రోత్సహించామని, ఫలితంగా బకాయిల భారాన్ని తగ్గించడానికి పాటుపడుతున్నాం. విద్యుత్‌చౌర్యం నిరోధించడంలో భాగంగా స్క్వాడ్స్ తనిఖీలతో రూ.75 లక్షలు వసూలు చేయగలిగామని పేర్కొంటున్న ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎస్.రమణతో ముఖాముఖి...

విద్యుత్ వినియోగం వివరాలు తెలపండి?

12 లక్షల మిలియన్ యూనిట్ల సాధారణ వినియోగం ఉంటుంది. ప్రస్తుతం 13 లక్షల నుంచి 15 లక్షల యూనిట్లు వరకు వినియోగం ఉంటోంది. 2023 ఫిబ్రవరిలో 355 మిలియన్ యూనిట్లు ఉండగా, 2024 ఫిబ్రవరిలో 414 మిలియన్ యూనిట్లు ఉంది.

జిల్లాలోని విద్యుత్ సర్వీసులు ఎన్ని?

జిల్లాలోని సబ్‌డివిజన్ల పరిధిలో 12,41,580 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో 92,79,997 గృహ వినియోగ కనెక్షన్లు, 18,8065 వ్యవసాయ కనెక్షన్లు,10,1552 వాణిజ్య కనెక్షన్లు, 711 ఇండస్ట్రియల్ కనెక్షన్లు, 6,534 కుటీర పరిశ్రమల కనెక్షన్లు, 9499 వీధి దీపాల కనెక్షన్లున్నాయి.

ట్రాన్స్‌ఫార్మర్లు లభ్యత ఎలా ఉంది?

జిల్లాలో 1,46,816 ట్రాన్స్‌ఫార్మర్లున్నాయి. ఇందులో త్రీఫేస్ ట్రాన్స్‌ఫార్మర్స్ 1,33,428, సింగిల్‌ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్స్ 1,3, 388 ట్రాన్స్‌ఫార్మర్స్ వరకు ఉన్నాయి.

నూతన సబ్‌స్టేషన్ల పనుల గురించి తెలపండి?

26 సబ్‌స్టేషన్లు (33కెవి) మంజూరు చేయడమైంది. ఇందులో 16 సబ్‌స్టేషన్ల నిర్మాణాలను పూర్తి చేయడమైంది. పులివెందుల నియోజకవర్గ పరిధిలోని రామన్నూతలపల్లి, లోపట్నూతల, కోడూరు నియోజకవర్గంలోని బాలాయపల్లి, రెడ్డివారిపల్లి, తల్లెంవారిపల్లి, ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని మీనాపురం, కడప నియోజకవర్గంలోని మామిళ్లపల్లి సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.

జగజ్జీవన్‌జ్యోతి స్కీమ్ అమలు జరుగుతోందా?

జగజ్జీవన్‌జ్యోతి స్కీమ్ అమలవుతోంది. ఎస్‌సి, ఎస్‌టి గృహ వినియోగదారులకు నెలకు 200 యూనిట్లు ఉచితంగా సరఫరా చేయడం జరుగుతోంది. జిల్లాలో 73,462 ఎస్‌సి విద్యుత్ వినియోగదారులకు నెలకు రూ.217.42 లక్షలు, 9856 ఎస్‌టి గృహవిద్యుత్ వినియోగారులకు నెలకు రూ.23.90 లక్షలను రాష్ట్రప్రభుత్వం చెల్లిస్తోంది.

జగనన్న కాలనీల విద్యుద్దీకరణ ఎలా ఉంది?

జిల్లాలో జగనన్న కాలనీ విద్యుద్దీకరణ ప్రక్రియ చురుకుగా సాగుతోంది. జిల్లాలోని 704 కాలనీల్లో 575 కాలనీల్లో విద్యుద్దీకరణ పూర్తి చేయడ మైంది. మిగిలిన 129 కాలనీల్లో పనులు చేపట్టాల్సి ఉంది.

బకాయి, ఆదాయాల గురించి తెలపండి?

రూ.26 కోట్ల నుంచి రూ.28 కోట్లు బకాయి ఉండేది. తన హయాంలో రూ.20 కోట్లకు బకాయిలను తగ్గించడమైంది. జిల్లా ట్రాన్స్‌కో రూ.180 కోట్ల ఆదాయాన్ని ఆర్జిస్తోంది. ఇందులో హెచ్‌టి ప్రయివేటులైన్స్ కింద రూ.95 కోట్లు, ఎల్‌టి ప్రయివేటు లైన్స్ కింద రూ.95 కోట్లు ఆదాయం వస్తోంది.

అంతరాయాల నివారణ గురించి మాట్లాడండి?

24X7 నాణ్యమైన విద్యుత్ సరఫరా, అంతరాయాల నివారణపై దృష్టి సారించాం. 33 కెవి ట్రాన్స్‌ఫార్మర్లు ట్రిప్పింగ్ జీరో స్థాయి నుంచి ఒన్ ఫీడ్స్ ఫర్ ఒన్ మన్త్ 144 ట్రిప్పింగ్స్ తగ్గకుండా చేయగలిగాం.ఈలెక్కన ఏటా 8,000 ట్రిప్పింగ్స్ నుంచి 2,000 ట్రిప్పింగ్స్ తగ్గించగలిగాం.ఈలెక్కన 6,000 ట్రిప్పింగ్స్ అంతరాయా లను నిరోధించగలిగాం.

పోలియో రహిత సమాజానికి కృషి



పోలియో చుక్కలు వేస్తున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

ప్రజాశక్తి - కడప అర్బన్

పోలియో రహిత దేశంగా మార్చే దిశగా చేపడుతున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని జిల్లాలో విజయ వంతం చేయాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం కడప గాంధీ నగర్ పాఠశాల ప్రాంగణం నందు ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రంలో కలెక్టర్ వి.విజయ్ రామరాజు చిన్నారులకు పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టర్‌తోపాటు నగర కమిషనర్ జిఎస్ఎస్ ప్రవీణ్ చంద్, ఆర్‌డిఒ మధుసూదన్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాగరాజు, డిఐఒ డాక్టర్ ఉమా మహేశ్వర్ కుమార్, ఆరోగ్యశ్రీ కో -ఆర్డినేటర్ డాక్టర్ బాలాంజనేయులు చిన్నారులకు పోలియో చుక్కలను వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పల్స్ పోలియో కార్యక్రమాన్ని అన్ని గ్రామాల్లో పట్టణాల్లో ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం 0-5 సంవత్సరాల లోపు చిన్నారులు జిల్లా వ్యాప్తంగా 2,28,131 మంది ఉన్నారని, వీరిలో ఏ ఒక్కరూ మిస్ అవ్వకుండా పోలియో చుక్కలు చేసేలా అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జిల్లాకు 3,04,900 పల్స్ పోలియో డోసులను స్టాక్ తెప్పించారని చెప్పారు. ఇందుకోసం 2029 పబ్లిక్ బూత్‌లు, 51 మొబైల్ బూత్‌లు, 23 ట్రాన్సిస్ట్ బూత్‌లను ఏర్పాటు చేసి.. 8,467 మంది వ్యాక్సినేటర్లను సిద్ధంగా ఉంచామన్నారు. పల్స్ పోలియో నిర్వహణ కోసం జిల్లా వ్యాప్తంగా 203 రూట్లకు గాను ఒక్కొక్క వాహనాన్ని ఏర్పాటు చేశామన్నారు.

పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా పేర్కొన్నారు. ఆదివారం స్థానిక నకాష్ వీధిలోని అర్బన్ హెల్త్ సెంటర్ లో పోలియో చుక్కలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలియో రహిత భారతదేశ నిర్మాణం కోసం గత కొన్ని సంవత్సరాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 0 నుంచి 5 సంవత్సరాల లోపు ఉన్న పిల్లలందరికీ పోలియో చుక్కలు వేస్తూ పోలియో రహిత నిర్మాణం చేయాలనే దృఢ సంకల్పంతో ముందుకు వెళుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ నాగరాజు, డాక్టర్ ఉమామహేశ్వరరావు, నాయకులు నారపురెడ్డి సుబ్బారెడ్డి, తోట కృష్ణ, పెద్దిరెడ్డి రామ్మోహన్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

కడపను సుందర నగరంగా తీర్చిదిద్దాం

- కడప ఎంపీ వై.ఎస్.అవినాష్‌రెడ్డి

ప్రజాశక్తి-కడప

కడప నగరాన్ని సుందరంగా తీర్చి దిద్దామని కడప ఎంపీ వై.ఎస్. అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కార్పొరేటర్ పాకా సురేష్ ఆధ్వర్యంలో స్థానిక అక్కయపల్లెలోని అక్కాయపల్లె పార్కు, అక్కాయపల్లి ప్లాజా, శాస్త్రి నగర్ పార్కులను ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్‌బాషా, మేయర్ సురేష్‌బాబు, కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎం. రామచంద్రారెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ అక్కాయపల్లి డివిజన్‌కు సంబంధించి దాదాపు రూ.2 కోట్లతో నిర్మించిన పార్కు సుందరీకరణ పార్కును నిర్మించారన్నారు. గత ప్రభుత్వంలో నగరానికి సంబంధించి 14వ ఆర్థిక సంఘం నిధులు, సాధారణ గ్రాంటు తప్ప అభివృద్ధి చేయడానికి ఒక్క రూపాయి కూడా నిధులు ఉండేవి కాదని అన్నారు. జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత వందలాది కోట్ల రూపాయలు నిధులు ఇచ్చి పెద్ద ఎత్తున రోడ్డు విస్తరణలు, సుందరీ కరణ, కూడళ్ల సుందరీకరణ, అవసరమైన చోట్ల డ్రైన్ నిర్మాణాలు ఇలాంటి మంచి అనేక కార్యక్రమాలు జరుగుతున్నాయని అన్నారు. ఇటీవల కడప నగరానికి సంబంధించి కాంప్రహెన్సివ్ వాటర్ పైప్ లైన్స్‌కు దాదాపు రూ.400 కోట్లు మంజూరు అయిందని చెప్పారు. టెండర్స్ కూడా పూర్తయ్యాయని, పనులు కూడా ప్రారంభం కానున్నాయని, ప్రతి ఇంటికీ నీటి కొళాయి ఇచ్చే ఇస్తున్నారని తెలిపారు. తొలుత అక్కాయపల్లెలోని అక్కాయ పల్లె పార్కు, అక్కాయపల్లి ప్లాజా, శాస్త్రి నగర్ పార్కులను ప్రారంభించారు.



పార్కు ప్రారంభోత్సంలో ఎంపీ, డిప్యూటీ సిఎం, ఎమ్మెల్సీ, మేయర్

ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అనంతరం జిమ్ చేయడానికి ప్రత్యేక పరికరాలను, పజిల్ గేమ్, ఆక్యుపంచర్ పాత్ వే, వాకింగ్ చేయడానికి నడకదారులు, ఆహ్లాదకరమైన వాతావరణంలో గడిపేందుకు పచ్చని గడ్డి, విరివిగా మొక్కలు, రాత్రిపూట వెలుతురు కోసం హైమాస్ లైట్లు, రంగురంగుల దీపాలంకరణ, పార్కు చుట్టూ సరికొత్తగా ఇనుప ఫ్రేమ్ తో ప్రహరీ ఏర్పాటు తదితరాలను పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, స్థానిక కార్పొరేటర్ పాకా సురేష్ తోపాటు ఇతర కార్పొరేటర్లు, నాయకులు, నాయకురాళ్లు, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి

- కలెక్టర్ వి.విజయ్ రామరాజు

ప్రజాశక్తి - కడప

రానున్న సాధారణ, పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులందరూ ఎన్నికల నియమావళిని పాటించడంతో పాటు ఎన్నికల వ్యయాన్ని పక్కాగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వి.విజయ్‌రామరాజు అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో త్వరలో నిర్వహించబోయే సాధారణ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పోటీ చేసే అభ్యర్యులు ఎన్నికల వ్యయంపై నిర్వహించే రికార్డులు, అక్కౌంట్స్, ఎంసిసి ఎంసిఎంసి, సువిధ, సి-విజిల్ లాంటి వివిధ ఐటి అప్లికేషన్స్ పై రాజకీయపార్టీల ప్రతినిధులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మేరకు ఎంపీకు పోటీ చేసే అభ్యర్థి రూ.95 లక్షలు, ఎమ్మెల్యేకు రూ.40 లక్షల ఖర్చు మించరాదు అన్నారు. అభ్యర్థి నామినేషన్ దాఖలు చేసే రోజు కంటే ముందుగానే సెపరేట్‌గా ఒక బ్యాంక్ ఖాతాను ఓపెన్ చేయాలన్నారు. నామినేషన్ వేసిన రోజు నుంచి డేట్ ఆఫ్ డిక్లరేషన్ వరకు తన ఎన్నికల ఖర్చును సంబంధిత రిజిష్టర్‌లో నమోదు చేసి నిర్ణీత సమయంలో వ్యయ అధికారులకు చూపించాలన్నారు. ఎన్నికల అధికారులు అభ్యర్థుల ఖర్చు పై షాడో రిజిస్టర్లను నిర్వహిస్తుంటారని తెలిపారు. అభ్యర్థి తన నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా చదివి జాగ్రత్తగా పూరించాలన్నారు. ప్రచారానికి స్టార్ క్యాంపెనర్లు వచ్చేటట్లు ఉంటే ముందుగానే సిఇఒ నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. నామినేషన్



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

దాఖలు చేసిన రోజు నుంచి అభ్యర్థి ప్రచారానికి అవసరమైన అనుమతులను సువిధ యాప్‌లో అప్లోడ్ చేసి అనుమతులను పొందాలన్నారు. ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులను చేయాలనుకుంటే సి-విజిల్ యాప్ ద్వారా చేయాలన్నారు. రానున్న ఎన్నికలను పకడ్బందీగా, నిష్పక్షపాతంగా, నిర్భయంగా, పారదర్శకంగా, విజయవంతంగా నిర్వహించేందుకు మనమందరం కృషి చేద్దాం అన్నారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సంబంధిత అధికారులు క్షున్నంగా హాజరైన రాజకీయ పార్టీల ప్రతినిధులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో నోడల్ అధికారి నందన్, జిల్లా మాస్టర్ ట్రైనర్లు మెప్మా పిడి సురేష్ రెడ్డి, డివిజినల్ కోపరేటివ్ అధికారి శివప్రసాద్, ఎంసీఎంసి మెంబెర్ సెక్రటరీ వేణుగోపాల్ రెడ్డి, సభ్యులు గుర్రప్పతో పాటు రాజకీయ పార్టీల నాయకులు హాజరయ్యారు.

క్రమశిక్షణతో చదువుకోవాలి

ప్రజాశక్తి- పోరుమామిళ్ల

విద్యార్థులు క్రమశిక్షణతో కూడినటువంటి విద్యను అలవర్చుకున్నప్పుడే ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని పాఠశాల చైర్మన్ గుర్రం పుల్లపు నాయుడు పేర్కొన్నారు. పట్టణంలోని వెంగమాంబ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ 20వ వార్షికోత్సవం, పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి మండల రెవెన్యూ అధికారి శిరీష, మండల విద్యాధికారి కాశయ్య, అగ్నిమాపక అధికారి నజీర్ అహ్మద్ ప్రముఖ కవి బొల్లు రామమోహన్ ప్రత్యేక అతిథులుగా పాల్గొని పిల్లలకు శుభాశీస్సులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశ నుంచే మంచి అలవాట్లు నేర్చుకోవాలన్నారు. పరీక్షలు జీవన్మరణ సమస్య కానేకాదని, ఆత్మవిశ్వాసంతో ఇష్టంతో చదివి పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. చదువుల్లో భవిష్యత్తులో రాణించాలంటే సానుకూల దృక్పథం కలిగి ఉండాలన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలలో విద్యార్థులందరూ ఉత్సాహభరితంగా పాల్గొని ఆనందించారు. కార్యక్రమంలో పాఠశాల



మాట్లాడుతున్న తహశీల్దార్ శిరీష

కరస్పాండెంట్ గుర్రం దిలీప్ కుమార్ , అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నాగ లింగారెడ్డి ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చదువే ఆస్తి : పిఒ

ప్రజాశక్తి -బి. కోడూరు



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్నపిఒ ప్రభాకర్‌రెడ్డి

విద్యార్థులు చదువే ఆస్తిగా బావించి చదువుకోవాలని సర్వ శిక్ష అభియాన్ పథకం అధికారి ఎ.ప్రభాకరరెడ్డి పేర్కొన్నారు ఆదివారం మండలంలోని కాసా నగరంలో ఉన్న కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయాన్ని సందర్శించారు. నాడు-నేడు పనులను, వసతులను, భోజన సదుపాయాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. చదువు, సంస్కారం విద్యార్థులకు చాలా ముఖ్యమని చెప్పారు. సమాజంలో పేదరికం పోవాలంటే చదువు ఒక్కటే మార్గమని చెప్పారు. ప్రతి విద్యార్థీ తల్లిదండ్రుల కోరికలు, ఆశయాలను నెరవే ర్చాలని పేర్కొన్నారు. ఎపిజె అబ్దుల్ కలాం చెప్పినట్టు 'పేదరికంలో పుట్టడం తప్పు కాదు కానీ పేదరికంతోనే చనిపోవడం తప్పు' అని ప్రతి విద్యార్థి స్వయంకృషితో ఒక లక్ష్యం నిర్దేశించుకుని ఈ సమాజంలో గొప్ప వ్యక్తిగా రాణించడానికి కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక కెజిబివి ప్రిన్సిపల్ శ్రీలత, ఆంగ్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మైన్ డైమండ్ షో

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని కోటిరెడ్డి సర్కిల్ వద్ద ఉన్న మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్ లో మైన్ డైమండ్ షోను ప్రారంభించారు. ముఖ్య అతిథులు, శ్రేయోభిలాషులు ప్రత్యేక వజ్రాభరణాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా షో రూమ్ హెడ్ లెసన్ సత్యం మాట్లాడుతూ ఈ నెల 7వరకు ప్రదర్శన ఉంటుందని తెలిపారు. పది నాణ్యమైన వాగ్దానాలను అందిస్తూ ఉందని చెప్పారు. నమ్మకమైన జ్యువెలరీ బ్రాండ్ మలబార్ అందిస్తుందని పేర్కొన్నారు. వార్షికోదాయంలో సామాజిక సేవ చేస్తుందన్నారు.



వజ్రాభరణాలను ప్రదర్శిస్తున్న మహిళలు

దూదేకులలకు తగిన ప్రాధాన్యత కల్పిస్తాం

- ఆత్మీయ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి ఎస్.బి అంజాద్‌బాషా



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి ఎస్.బి అంజాద్‌బాషా

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

దూదేకులకు ఎలక్టోరల్, ఇతర నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పిస్తామని డిప్యూటీ సిఎం ఎస్‌బి అంజాద్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని అపూర్వ కల్యాణ మండపంలో ఎపి నూర్‌బాష్ దూదేకుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బాదుల్లా, జిల్లా అధ్యక్షులు పెద్దన్న అధ్యక్షతన నిర్వహించిన దూదేకుల ఆత్మీయ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. దూదేకులు ఎదుర్కొంటున్న సామాజిక హోదాకు మారుపేరైన ముస్లిమ్ మైనార్టీలుగా పరిగణించే జీవో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దృష్టిలో ఉందన్నారు. దూదేకులను బిసి కార్పొరేషన్ నుంచి మైనార్టీ కార్పొరేషన్ కిందికి మార్పు చేయడంపై దృష్టి సారించామని తెలిపారు. రెండెకరాలు కమ్యూనిటీ హాల్ నిర్మాణ సమస్యను కలెక్టర్‌తో మాట్లాడి పరిష్కరిస్తామని హామీనిచ్చారు. 76 స్వాతంత్ర్య పాలనలో ముస్లిములను ఓటు బ్యాంకులుగానే గుర్తించారని, కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఓ ముస్లిమ్ ఎంఎల్‌ఏను ఏకంగా ఉపముఖ్యమంత్రిని చేసిన ఘనతను సొంతం చేసుకున్నారని తెలిపారు. చంద్రబాబు హయాంలో దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ పదవిని ఎవరికైనా ఇచ్చారా అని ప్రశ్నించారు. టిడిపి హయాంలో దూదేకులకు తీవ్రమైన అన్యాయం చేశారని తెలిపారు. ముఖ్య మంత్రి వైఎస్ జగన్ బిసిల్లోని 139 కులాలను గుర్తించడం తోపాటు 56 కార్పొరేషన్లు, చైర్మన్లు, డైరెక్టర్ వంటి 700 పదవులను కల్పించారని గుర్తు చేశారు. 2014 నుంచి టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులుగా కొనసాగుతున్న ఆర్.శ్రీనివాసులరెడ్డి దూదేకులకు, ముస్లిములకు ఏమి చేశారో చెప్పాలని నిలదీశారు. అంతకు ముందు దూదే కుల కార్పొరేషన్ ఛైర్మన్ ఓ. రసూల్ మాట్లాడుతూ వైసిపి హయాంలోనే కడపను సుందర నగరంగా తీర్చిదిద్దుతున్నారని కొనియాడారు. అనంతరం ఎపి నూర్‌బాష్ దూదేకుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకేసుల బాదుల్లా మాట్లాడుతూ ఎళ్లవేళలా అందుబాటులో ఉండే అంజాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించు కోవాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అంతకు ముందు పశుగణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ అక్బర్‌అలీ మాట్లాడుతూ టిడిపి నాయకులు గెలిచినా, ఓడినా ఒకరు హైదరాబాద్‌లో వ్యాపారం, మరొకరు విజయవాడలో కాంట్రాక్టులు చేసుకునేందుకు వెళ్తారని, ప్రజలకు అందుబాటులోలేని నాయకులను ఏవిధంగా ఆదరిస్తారని ప్రశ్నించారు. ఆత్మీయ సమావేశానికి వైసిపి రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఇమామ్, బాషా, కడప నియోజకవర్గ వైసిపి సమన్వకర్త ఎస్‌బి అహమ్మద్ బాషా, సంఘం జిల్లా మహిళా అధ్యక్షులు రజియాబేగం, గౌరవాధ్యక్షులు జహరా భాను, పీరమ్మ, సంఘం నాయకులు కమాల్‌రాజా, కుళాయప్ప, ఖాదర్‌పల్లి నాగూరు కుళాయప్ప, బాబు చెంద్రాయుడు, రహీమ్, ఖలీల్, దస్తగిరి, మహ్మద్ రసూల్, మహబూబ్‌బాషా, సిద్ధయ్య, సుభా న్‌లతోపాటు పెద్దఎత్తున దూదేకుల సోదరులు హాజరయ్యారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలో మేము సైతం సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రాన్ని అర్బన్ సిఐ సి. భాస్కర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రెండు, మూడు నెలల ఎండలు తీవ్రంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఎక్కువ మంచి నీరు తీసుకోవాలని తెలిపారు. మేము సైతం సేవా సంస్థ సభ్యులు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రాము, అయ్యావారయ్య,షామియానా సురేష్, కిషోర్,నాగేంద్ర,రామరాజు,గురువయ్య, లేపాక్షి,శివరాం,రామలోకం, భాను, వారి కుటుంబ సభ్యులు, శివకుమార్, గోపి, సంపత్ పాల్గొన్నారు.

మానవ హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా గోవుల మల్లికార్జున

కడప : ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మానవ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మన్యం రాజశేఖర్ రాష్ట్ర కార్యదర్శిగా గోగుల మల్లికార్జునను నియమించారు. అనంతరం కడప కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మానవ హక్కుల చట్టాల పై అవగాహన ప్రతి ఒక్కరిలో కలిగి ఉండాలన్నారు. ప్రస్తుత పరిస్థితులలో భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను కాపాడే దిశగా ఎక్కడ అయినా మానవ హక్కుల ఉల్లంఘనలు జరిగిన తక్షణమే ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ వాటిపై పోరాటం చేస్తుంది అని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి అవగాహన కల్పిస్తామని ఈ సందర్భంగా ఆయన ఉన్నారు. తనకు సహకరించిన పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వల్లి, పిసిసి కార్యదర్శి గంగిశెట్టి ఉమా శంకర్, పిసిసి మైనారిటీ సెక్రటరీ షేక్ దస్తగిరికి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

హక్కుల సాధనే మాదిగ మహానాడు లక్ష్యం

కడప అర్బన్ : తమ హక్కుల సాధనే లక్ష్యంగా మాదిగ మహానాడు పనిచేస్తుందని రాష్ట్ర అధ్యక్షులు బోయినపల్లె ప్రభాకర్ అన్నారు. ఆదివారం వైఎస్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో జిల్లా అధ్యక్షులు గున్న జయరాములు అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అధిక సంఖ్యలో ఉన్న మాదిగ జాతి అభివృద్ధి లో మాత్రం దిగువ స్థాయిలో ఉందని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం మాదిగలకు దక్కాల్సిన ప్రభుత్వ లబ్ధి అన్నింటిలో నిర్వీర్యం చేయడం దీనికి ఒక కారణంగా భావిస్తున్నామన్నారు. ఎస్‌సి సబ్ ప్లాన్ నిధులు కూడా నిర్వీర్యం కావడం మాదిగ జాతికి మౌలిక సదుపాయాలకు అడ్డు కట్ట వేయడమేనని ఆరోపించారు. విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో తమకు దక్కాల్సిన అన్ని హక్కులు తాము పొందేలా జాతి కోసం మాదిగ మహానాడు పోరాడుతుందని చెప్పారు. జిల్లా అధ్యక్షుడు గున్న జయరాములు మాట్లాడుతూ జిల్లాలో సంఘాన్ని బలోపేతం చేసి హక్కుల కోసం పోరాడుతామని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిట్టా శ్రీకాంత్, సంయుక్త కార్యదర్శి ఏ ప్రకాష్, నూతన కమిటీ ఆర్గనైజర్ బాజీ, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు వై విజయ్ నగర నాయకులు రమణయ్య, శ్రీను, సురభి రామాంజనేయులు, గోపయ్య పాల్గొన్నారు.

విద్య వైజ్ఞానిక సంబరాలు భేష్

ప్రజాశక్తి-సిద్ధవటం

విద్య, వైజ్ఞానిక సంబరాలు నిర్వహించడం ప్రశంసనీయమని జెవివి రాష్ట్ర కమిటీ మెంబర్ దేవదత్తం, సుజనకుమార్, పంచాయతీరాజ్ ఇంజినీర్ శేషారెడ్డి, పౌండర్ ఆఫ్ ఆర్డీ చైర్మెన్ శివారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక శ్రీ నలంద ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న విద్యా వైజ్ఞానిక సంబరాల్లో భాగంగా చివరి రోజు ఆదివారం విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను వారు సందర్శించారు. 252 మంది విద్యార్థుల తల్లిదండ్రులు, 100 మంది హాస్టల్ విద్యార్థులు, వివిధ స్కూల్స్ విద్యార్థులు సందర్శించి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. అనంతరం అతిథులను కరస్పాండెంట్ పద్మావతి శాలువ, మెమోంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ పూర్వపు జిఎం గోపాల్, పంచాయతీరాజ్ విశ్రాంత ఇంజినీర్ శేషారెడ్డి, జెవివి సభ్యులు సుజన్ కుమార్ , జెవివి కార్యదర్శి బాలా బయన్న, ఎస్‌పిబివిడి సభా హైస్కూల్ కరస్పాండెంట్ మధుసూదన్, పలువురు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పరిశ్రమల శాఖ పూర్వపు జిఎం గోపాల్



అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు

సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక నెహ్రు రోడ్డులోని శ్రీ వేదవ్యాస డిగ్రీ కాలేజి ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో మూడవరోజు పెద్దశెట్టిపల్లె గ్రామంలో విద్యార్థులు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాం డెంట్ ఎల్.నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు జాగ్రత్తలు పాటిస్తే సీజనల్ వ్యాధులు దరిచేరవని తెలిపారు. కళాశాల ప్రెసిడెంటు జి.సుదర్శనరెడ్డి మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు గురించి వివరించారు. ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం ఆఫీసర్ వి.రామలక్ష్మిరెడ్డి మాట్లాడుతూ వేసవిలో అధిక ఉష్ణోగ్రతల ప్రభావంతో డిహైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం ఉంటుందని, ఈ సమస్య ఎదురుకాకుండా ఉండాలంటే నీరు, నిమ్మరసం, కొబ్బరి నీరు, గ్లూకోజ్ వంటి వాటిని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం ఆఫీసర్లు కె.నాగరాజ, ఎస్.పి.యాసిన్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్



జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న సిబ్బంది

రాష్ట్రంలోని అన్ని శిల్పారామాల్లో పనిచేస్తున్న హౌస్ కీపింగ్, సెక్యూరిటీ గార్డులకు వేతనాలు పెంచడంతో శిల్పారామంలో పనిచేస్తున్న సిబ్బంది ఆదివారం ఎఒ సుధాకర్ ఆధ్వర్యంలో సి.ఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ముఖ్యమంత్రి నవంబర్ 9, 2023లో శిల్పారామం ప్రారం భోత్సవానికి విచ్చేసిన సందర్భంలో తాము అందరం కలిసి ఆయన్ను జీతాలు పెంచాలని అడిగామన్నారు. అందుకు ఆయన స్పందించి తమ అందరి జీతా లను ఫిబ్రవరి 2024 నుంచి పెంచినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

మొదటి స్థానంలో నిలిచిన 'మాదన్న' విద్యార్థి

ప్రజాశక్తి - మైదుకూరు

మైదుకూరు పట్టణానికి చెందిన మాదన్న మెమోరియల్ హైస్కూల్ 5వ తరగతి విద్యార్థి బి.తిరుమలదేవి అబాకస్ పోటీలలో రాయలసీమ జోన్ లెవెల్‌లో మొదటి స్థానంలో నిలిచినట్లు పాఠశాల కరెస్పాండెంట్ ఎస్.వెంకట్‌రాముడు తెలిపారు. కడప గాంధీ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన అబాకస్ పోటీలలో తిరుమలాదేవి ఉత్తమ ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలిచిందన్నారు. త్వరలో జరిగే రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలో పాల్గొనే అవకాశాన్ని పొందారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని పాఠశాల సిబ్బంది అభినందించారు.

వైసిపి నాయకుల గుండెల్లో రైళ్లు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జెండా సభ వైసిపి నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తలా చేసిందనడంలో ఎలాంటి సందేహం లేదనిపిస్తుందని జమ్మలమడుగు జనసేన కో-ఆర్డినేటర్స్ నల్లంశెట్టి నాగార్జున, దేరంగుల జగదీష్ పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లా డుతూ జెండా సభలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వైసిపి పాలనను ఎండగట్టిన వైనాన్ని ఆ పార్టీ నాయకులు జీర్ణిం చుకోలేక పోతున్నారన్నారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచ మల్లు శివప్రసాద్‌రెడ్డి అజ్ఞానంతో పవన్‌కల్యాణ్‌ను విమర్శించడం సరి కాదన్నారు. ఇకమీదట పవన్ కల్యాణ్‌పై మాట్లాడేటప్పుడు ఆచితూచి మాట్లాడు తున్నారని భావిస్తున్నా మన్నారు. లేని పక్షంలో మరో రకంగా తాము స్పందిం చాల్సి ఉంటుందని తెలిపారు. ఒకటిన్నర నెల తర్వాత ఎవరు ఏమిటో జనాలే నిర్ణయిస్తారని తెలిపారు.



మాట్లాడుతున్న జనసేన నేతలు నాగార్జున, జగదీష్

అవయవ దానంపై విస్తృత అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - చక్రాయపేట



అవయవ దానంపై ర్యాలీ నిర్వహిస్తున్న ట్రిపుల్ఐటి విద్యార్థులు

అవయవదానంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షులు రాజు పేర్కొన్నారు. మండలంలోని మారెళ్లమడక గ్రామంలో ఆదివారం ఇడుపుల పాయ ట్రిపుల్ఐటి ఎన్ఎస్ఎస్ యూనిట్-9, పులివెందుల స్నేహిత అమృత హస్తం సేవా సమితి ఆధ్వర్యంలో అవయవ దానంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారి అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ అవయవ దానం ఆవశ్యకత, విశిష్టతను వివరించారు. అవయవదానం చేస్తే మరణించినా మరోసారి అవయవాల అనారోగ్యంతో బాధ పడుతున్న వారి రూపంలో మరణించిన కూడా మళ్లీ జీవించే అవకాశం ఉందని తెలిపారు. ఏదైనా ప్రమాదం, దీర్ఘకాలిక వ్యాధితో కోమాలో ఉండగా వారి కుటుంబ సభ్యుల అంగీకారం మేరకు అవయవదానాలు చేయాలన్నారు. మనిషి మరణానంతరం మట్టిలో కలిసిపోయే నేత్రాలు దానం చేయడం ద్వారా అంధత్వంతో ఈ లోకాన్ని చూడలేక అంధకారంలో ఉన్న వారి జీవితాలలో వెలుగులు నింపవచ్చున్నారు. అనంతరం నేత్రదానం, అవయవ దానం ప్రతిజ్ఞ చేయించిన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి అనిల్‌కుమార్‌రెడ్డి సమక్షంలో 85 మంది విద్యార్థులు నేత్రదాన అంగీకార పత్రాలలో సంతకాలు చేసి, రాజుకు అందజేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం నవనీత, సర్పంచ్ నరసింహులు, నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషియన్ హరీష్, ట్రిపుల్ఐటి విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నివాళులర్పించిన తులసిరెడ్డి

ప్రజాశక్తి - చక్రాయపేట

చక్రాయపేట మండలం కుమారకాల్వ గ్రామానికి చెందిన కొవ్వూరి రాఘవరెడ్డి భౌతిక కాయానికి పిసిసి మీడియా చైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి ఆదివారం శ్రద్ధాంజలి ఘటించారు. రాఘవరెడ్డి వయోభారంతో శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న తులసిరెడ్డి కుమారకాల్వ గ్రామానికి వెళ్లి రాఘవరెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అమర్, వెంకటేష్, ఉత్తన్న, వినయ్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలం పరిధిలోని బుడ్డాయపల్లె సమీపంలో కడప-కర్నూల్ జాతీయ రహదారిపై ఆదివారం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుడి శరీరంపై ఎలాంటి గాయాలు లేవని పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 91211 00623 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.



మహాశివరాత్రికి అల్లాడుపల్లె ముస్తాబు

ఉత్సవానికి వేలాదిగా తరలిరానున్న యాత్రికులు - ఏర్పాట్లల్లో నిర్వాహకులు

ప్రజాశక్తి - చాపాడు

ఈ నెల 8,9 తేదీల్లో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని అల్లాడుపల్లె శ్రీవీరభద్రస్వామి దేవస్థానంలో ఉత్సవాలను ఘ నంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. 8న స్వామివారికి అభిషేకం, స్వామివారి కల్యాణం, గ్రామోత్సవం, జాగరణకు ఏర్పాట్లు చేపడుతున్నారు. జాతర సమయంలో భక్తులకు కాలక్షేపం కోసం సాం స్కృతిక కార్యక్రమాలు, చెక్కభజన, ఆర్కెస్ట్రా, సత్యహరిశ్చంద్ర నాటకం, నందికోలు ఉత్సవ కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశారు. 9న రాష్ట్రస్థాయి ఎడ్లచే బండ లాగుడు పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కొత్తగా పది రోజులపాటు ప్రథ మ బ్రహ్మోత్సవాలు 1 నుంచి 10వ తేదీ వరకు ఘనంగా నిర్వహిస్తున్నారు. చైర్మన్ జివై వెంకటసుబ్బారెడ్డి (ఉదయ్), అల్లాడుపల్లె సర్పంచ్ జిఎం కిషోర్ కుమార్‌రెడ్డి, ఇఒ శ్రీనివాసులు, ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు, సిబ్బంది ఏర్పాట్లు చేపడుతున్నారు. బ్రహ్మంగారి గురువుగా వీరభద్రస్వామి ప్రసిద్ధి.

సౌకర్యవంతంగా ప్రయాణం..

మైదుకూరు-ప్రొద్దుటూరు ప్రధాన రహదారి సమీపంలో దేవాల యం ఉండడంతో ప్రయాణం సౌకర్యవంతంగా ఉంటుంది. మైదుకూరు, ప్రొద్దు టూరు నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఏర్పాట్లు చేస్తోంది. పండుగ రెండు రోజులపాటు నిర్విరామంగా అన్నదాన కార్యక్రమం ఉంటుంది. శివరాత్రి సందర్భంగా దేవస్థాన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భద్రకాళి సమేత వీరభద్రస్వామి అన్నదాన సత్రంతోపాటు సర్వజన అన్నదాన సత్రం, ఆర్యవైశ్య, విశ్వబ్రాహ్మణ సత్రాలతోపాటు అనేకమంది అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించే ఏర్పాట్లు జరుగుతున్నాయి.



వీరభద్రస్వామి దేవస్థానం(ఇన్‌సెట్)బ్రహ్మోత్సవాల్లో భాగంగా అలంకరించిన ఉత్సవ విగ్రహాలు

ఇబ్బందుల్లేకుండా అన్ని ఏర్పాట్లు..



దూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేపడుతున్నాం. ఇప్పటికే క్యూలైన్లు, తాగునీరు, పార్కింగ్, జాగరణ సందర్భంలో విద్యుత్ దీపాల ఏర్పాటు పర్యవేక్షిస్తున్నాం. కమిటీ సభ్యులు, సర్పంచ్ కిషోర్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిత్యం పర్యవేక్షణ ఉండేలా చర్యలు చేపడుతున్నాం. అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని ముందుకు సాగుతున్నాం. ఆలయ కమిటీ సభ్యులకు ప్రజలు సహకరించి శివరాత్రి మహా పర్వదినం సందర్భంగా రెండు రోజులు, ప్రస్తుతం నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయాలి.

- జి.వై.వెంకట సుబ్బారెడ్డి (ఉదయ్), ఆలయ కమిటీ చైర్మన్, అల్లాడుపల్లె దేవాళాలు

పోలీసులు, అధికారులతో ఏర్పాట్లు..



మహాశివరాత్రి సందర్భంగా స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు ఏర్పాట్లు చేపడుతున్నాం. రెండు రోజులపాటు స్వామివారికి నిర్వహించే ప్రత్యేక పూజల్లో పాల్గొనేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నాం. తాగునీరు, పారిశుధ్యం, ప్రథమ చికిత్స కల్పిస్తున్నాం. వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేశాం. ఇప్పటికే అధికారులు, పోలీసులతో కలిసి ఏర్పాట్లు చేపడుతున్నాం. భక్తులు కూడా దేవస్థాన సిబ్బందికి సహకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.

- శ్రీనివాసులు, ఇఒ, అల్లాడుపల్లె దేవాళాలు

సమస్యలు తలెత్తకుండా గట్టి బందోబస్తు

ప్రజాశక్తి - చాపాడు

శివరాత్రి సందర్భంగా వివిధ ప్రాంతాల నుండి అల్లాడుపల్లెకు వచ్చే భక్తులకు ఎలాంటి సమస్యలు, ఇబ్బందులు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేస్తామని మైదుకూరు రూరల్ సిఐ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం వీరభద్ర స్వామి ఆలయ ఆవరణాన్ని ఆలయ చైర్మన్ జివై వెంకటసుబ్బారెడ్డి, ఇఒ శ్రీనివా సులుతో కలిసి సిఐ పండుగ సందర్భంగా చేయవలసిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ తరలివచ్చే భక్తులకు అనుగుణంగా ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నామన్నారు. వాహనాలు నిలిపేందుకు ప్రత్యేక పార్కింగ్ ప్రదే శాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆలయ సిబ్బంది కూడా ప్రత్యేకంగా వాలంటీర్లను నియమించి, భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. వాలంటీర్లకు ఐడీ కార్డులు, ప్రత్యేక టీ షర్ట్ అందివ్వాలన్నారు. భక్తులు కూడా పోలీస్ సిబ్బందికి సహకరించాలని సిఐ కోరారు. సమన్వయంతో శివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. క్యూ లైన్లు, విఐపి లైన్ల ఏర్పాట్లపై చర్చించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, వివేకానంద పాఠశాల కరస్పాం డెంట్ నాగేశ్వర్‌రెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఏర్పాట్లపై ఆలయ సిబ్బందితో చర్చిస్తున్న సిఐ శ్రీనాథ్‌రెడ్డి

కార్యకర్తలు అండగా నిలవాలి : సతీష్‌రెడ్డి



సతీష్‌రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న కార్యకర్తలు

ప్రజాశక్తి - వేంపల్లె

వైసిపితో చేసే కొత్త ప్రయాణంలో తనతో కలిసి నడిచిన కార్యకర్తలు అందరూ అండగా ఉండాలని ఆ పార్టీ నేత సతీష్‌కుమార్‌రెడ్డి అన్నారు. సిఎం జగన్‌రెడ్డితో వైసిపి కండువా వేసుకొని ఆదివారం ఆయన వేంపల్లెకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు నాయకులు, కార్యకర్తలు కలిశారు. వైసిపిలో చేరినందుకు సంతోషంగా ఉందని కార్యకర్తలు సతీష్‌రెడ్డిని గజమాలతో సత్కరించారు. అనంతరం సతీష్‌రెడ్డి కార్యకర్తలతో విడివిడిగా చర్చించారు. వైసిపి ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతునివ్వాలని కోరారు. రాబోవు ఎన్నికల్లో సిఎం జగన్‌కు, ఎంపీ అవినాష్‌రెడ్డిలను మంచి మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలకు చెందిన ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కారం చేస్తామని తెలిపారు. అందరికి సాయం చేస్తానని హామీ ఇచ్చారు. పాత,కొత్త అనే తేడా లేకుండా అందరూ కలిసి పని చేయాలని సిఎం చెప్పారని సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. సముచిత స్థానం కల్పించాలని పలువురు కార్యకర్తలు కోరారు. సిఎం కూడా మనస్పూర్తిగా చేస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. అధికారంలోకి మళ్లీ వైసిపినే వస్తుందని, ఎవరూ అపోహలు పడవద్దని, రాబోవు కాలంలో అందరూ బాగుపడుతామని చెప్పారు. తన వెంట ఉన్న వారి అందరికి తానే అండగా ఉంటానని సతీష్‌రెడ్డి భరోసా ఇచ్చారు.

ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

రాష్ట్రానికి ప్రత్యేకహోదా రావాలంటే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని పిసిసి మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. స్థానికంగా ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ అధి కారంలోకి వస్తే ఇందిరమ్మ అభయం పథకం అమలవుతుందన్నారు. ఈ పథకం కింద ప్రతి నిరుపేద కుటుంబానికి నెలకు రూ.5000 ఆర్థికసాయం అందుతుందన్నారు. జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాల డబ్బు కలిపినా ఇందిరమ్మ అభయ పథకానికి సరిరావు అని తులసిరెడ్డి తెలిపారు. తాను మళ్లీ ముఖ్యమంత్రి కాకుంటే ప్రస్తుతం అమలవుతున్న పథకాలన్నీ నిలిచిపోతాయని జగన్ చెప్పడం హాస్యాస్పదమన్నారు. హంతకుల పార్టీ అయిన జగన్‌కు ఓటు వేయొద్దని ఒక చెల్లెలు సునీత, ఆర్థిక నేరస్తుల పార్టీకి ఓటు వేయొద్దని మరో చెల్లెలు షర్మిల చెబుతుంటే జగన్ ముఖ్యమంత్రి పీఠాన్ని అతుక్కోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గోగుల రమేష్, కిసాన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంగల్‌రెడ్డి, సింహాద్రిపురం మండలశాఖ అధ్యక్షులు శివ, ఉపాధ్యక్షులు బ్రహ్మం, వేంపల్లి మండల శాఖ బోరెడ్డి నరసింహారెడ్డి, జిల్లా కార్యదర్శి పాలెం సుబ్బరాయుడు, నాగరాజు, తరుణ్ కుమార్‌రెడ్డి, నిఖిల్, స్టాన్లీబాబు, విజయేంద్ర, వినయ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్.తులసిరెడ్డి

పోలియో రహిత సమాజానికి తోడ్పాటునివ్వాలి



పోలియో చుక్కలు వేస్తున్న చైర్మన్ వరప్రసాద్



చాపాడు: పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ తోడ్పడాలని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ అన్నారు. ఆదివారం చిన్న కొండప్ప కాలనీ, అంకాలమ్మ పేట వార్డు సచివాలయాల్లో పోలియో చుక్కల కార్యక్రమాన్ని ప్రారంభించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజుల్లా, రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, కౌన్సిలర్లు భార్గవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **వేంపల్లె :** చిన్నారులకు పోలియో చుక్కలు వేసి పోలియో రహిత సమాజం కోసం పాటు పడాలని పిసిసి మీడియా చైర్మన్ ఎన్ తులసిరెడ్డి అన్నారు. ఆదివారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రంలో తులసిరెడ్డి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. 5 సంవత్సరాలలోపు పిల్లలకు తల్లిదండ్రులు పోలియో చుక్కలు వేయించాలని కోరారు. పోలియో చుక్కలు వేయడం వలన చిన్నారులకు అంగవైకల్యం రాకుండా ఉండేందుకు వీలు ఉంటుందని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాల్లో చిన్నారులకు జడ్పీటీసీ రవికుమార్ రెడ్డి, ఎంపిపి లక్ష్మి గాయత్రి, మండల కన్వీనర్ చంద్రఓబుల్ రెడ్డి, మాజీ సర్పంచ్ ప్రసాద్‌రెడ్డి, ఎంపిడిఒ సంపతి దివిజా, మండల కో-ఆప్షన్ మెంబర్ అసనయ్య పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో వైద్యులు స్వాతిసాయి, వార్డు మెంబరు ముత్యాల ఆంజనేయులు, గణేష్, ఎంపిటిసి భారతి, కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, బాలం సుబ్బరాయుడు పాల్గొన్నారు. **కడప :** కడప నగరం 16వ డివిజన్‌లోని మేరీ నగర్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు చెప్పలి పుల్లయ్య పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. **పోరుమామిళ్ల :** అప్పుడే పుట్టిన బిడ్డ నుండి ఐదేళ్ల లోపు ఉన్న పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని ఎమ్మెల్సీ డిసి గోవిందరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఏర్పాటు చేసిన పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ రవి బాబు, మెడికల్ ఆఫీసర్స్ మేరీ ఎల్సా, శ్రీవిద్య, కరిష్మా, నాగేంద్ర బాబు, నాగలక్ష్మి , ఆరోగ్య విద్యాధికారి సాదు వెంకటేశ్వర్లు,డాక్టర్ మార్కారెడ్డి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నిర్మల, నాగమ్మ, రఘు రాములు, ఏఎన్ఎం, ఎం ఎల్ హెచ్ పి లు హాజరు అయినారు, బద్వేల్ యువ నాయ కులు ఆదిత్య రెడ్డి , ఎంపీపీ సీ భాష, జడ్పిటిసి ముత్యాల ప్రసాద్, సర్పంచ్ రమణారెడ్డి, పాల్గొ న్నారు. **చాపాడు :** అప్పుడే పుట్టిన బిడ్డ నుండి 5 సంవత్సరాలలోపు పిల్లలు పోలియో చుక్కలు వేయించుకోవాలని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి సూచించారు. ఆదివారం చాపాడు సచివాలయంలో ఆయన పల్స్ పోలియో చుక్కలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తల్లిదండ్రులు సిబ్బందికి సహకరించాలని కోరారు. డిప్యూటీ డిఎంహెచ్ఒ మల్లేష్ మాట్లాడుతూ మండల పరిధిలో 5సంవత్సరాలలోపు పిల్లలు 3,020 మంది ఉన్నారని తెలిపారు. 180మంది సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపారు. ఎంపిపి టి లక్షుమయ్య, వైసిపి మండల కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, గృహ సారధుల మండల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి, జడ్పీటీసీ భర్త శాంతరాజు, వైసిపి నాయకులు మహే రెడ్డి, బాబ్జీ, మండల వైద్యాధికారి రాజేష్ కుమార్, డాక్టర్లు ఓబులేష్, కావ్య మాధురి, ఆరోగ్య విస్తరణ అధికారి రాఘవయ్య, సూపర్వైజర్స్ బాబుల్‌రెడ్డి, సరస్వతి, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు. **బి. కోడూరు :** మండలంలోని పది పంచాయతీల పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. 0 నుండి ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ వినోద్ కుమార్, రాజ్, డాక్టర్ ఉదయ్ కుమార్, ఆశా, అంగన్వాడీ సిబ్బంది. సచివాలయం ఎఎన్ఎం, మొత్తం వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **చక్రాయపేట :** మారెళ్ల మడక ప్రాథమిక పాఠశాలలో ఇడుపులపాయ ట్రిపుల్ఐటి ఎన్ఎస్ఎస్, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు, ఎఎన్ఎం నవనీత పల్స్ పోలియో చుక్కలు వేసి కార్యక్రమం ప్రారంభించారు. అంగన్వాడీ కార్యకర్త లు, ఆశా కార్యకర్తలు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు గ్రామస్థులు పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు :** రెండు పోలియో చుక్కలతో నిండైన జీవితం లభిస్తుందని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి అన్నారు. పల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక శ్రీరాములపేట అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఆయన పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. **జెవివి ఆధ్వర్యంలో..** జనవిజ్ఞాన వేదిక (జెవివి) ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక నందిని క్లాత్‌మార్కెట్ వద్ద పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి దినేష్‌బాబు, కంటివైద్యులు యం.యస్.తేజ, వైద్యాధికారులు నాగజ్యోతి, శోభారాణి, జెవివి నాయకులు డాక్టర్ మురుకూటి సూర్యానారాయణరెడ్డి, తవ్వాసురేష్ పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు : పోలియో చుక్కలు వేస్తున్న జెవివి నాయకులు



పథకాలను ప్రజలకు వివరిస్తున్న భూపేష్‌రెడ్డి

ఎర్రగుంట్లలో భూపేష్‌రెడ్డి పర్యటన

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణంలోని 8,9,10 కౌన్సిల్ వార్డుల్లో ఆదివారం జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి పర్యటించారు. బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానిక నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ప్రతి గడప తిరుగుతూ టిడిపి మినీ మేనిఫెస్టోలోని పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరు సైకిల్ గుర్తుకు ఓటు వేసి టిడిపిని గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలో మండల టిడిపి ఇన్‌ఛార్జి జయరామిరెడ్డి, మండల అధ్యక్షులు మోహన్‌రెడ్డి, బయపరెడ్డి, రమేష్‌రెడ్డి, జంగంరెడ్డి, కె.శీను, టైలర్ మాబు, విజయేంద్ర, శ్రీనివాసులు, అబ్దుల్, మాబు సుభాన్, దస్తగిరి, రజాక్, చంద్ర, జనసేన జగదీష్, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



శ్రీరామ్‌నగర్‌లో పర్యటిస్తున్న టిడిపి నాయకులు

అరాచక పాలనకు చరమగీతం పాడాలి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వ అరాచక పాలనకు ప్రజలు చరమగీతం పాడాలని టిడిపి పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవిరెడ్డి అన్నారు. ఆదివారం వేంపల్లెలోని శ్రీరాంనగర్, గండి రోడ్డు ప్రాంతాల్లో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. బిటెక్ రవిరెడ్డి, ఆయన సతీమణి లతారెడ్డి ఇంటింటికి తిరిగి పార్టీ అమలు చేసే సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. కులమతాలకతీతంగా తెలుగు దేశం పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రిగా కావాలన్నారు. చంద్రబాబు ఒక విజన్ ఉన్న నాయకుడని చెప్పారు. కార్యక్రమంలో పులివెందుల జనసేనా ఇన్‌ఛార్జి హరీష్, మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, నిమ్మకాయల మహమ్మద్ దర్బార్, జయచంద్రారెడ్డి, తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు బాలస్వామిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రామగంగిరెడ్డి, డివి సుబ్బారెడ్డి, ఆర్‌వి రమేష్, పూల అల్లాబకష్, గోగుల మల్లికార్జున, వల్లెపు రమణ, ఆది, మహమ్మద్, వేమకుమార్, డక్కా రమేష్, సుబ్బరాయుడుతోపాటు పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

టిడిపి హామీ పత్రాలు అందజేత

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్

రాజుపాలెం మండలం గాదేగూడూరు గ్రామంలో ఆదివారం టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి టిడిపి ప్రకటించిన ఆరు సంక్షేమ పథకాలను వివరించి హామీ పత్రాలను అందజేశారు. ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమం కూడా ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించి పక్కాగా చేయాలన్నారు. కార్యక్రమంలో రవికాంత్‌రెడ్డి, సురేష్ నాయుడు, రోషిరెడ్డి, నరసింహారెడ్డి, పత్తిపాటి అర్జున్ చౌదరి, హరి నాయుడు, హరికృష్ణ, గణేష్ నాయుడు, శంభురెడ్డి, శరత్ కుమార్, నాగేశ్వరరావు నాయుడు, సుబ్బరాయుడు, నాగార్జున నాయుడు, నాగభూషణ్ నాయుడు, రాజుపాలెం మండల కన్వీనర్ దనిరెడ్డి విశ్వనాథరెడ్డి, మాజీ రాజుపాలెం సర్పంచ్ సాన వెంకటసుబ్బారెడ్డి, వెలవలి పద్మనాభరెడ్డి, నాయకులు, కార్యకర్తలు, నందమూరి అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



పథకాలను వివరిస్తున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి